

# మహా సరిహద్దుల్లోకి అగ్రనేతలు







ప్రచారానికి వెళుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

- పవన్‌కల్యాణ్ పాలజ్ సభ సక్సెస్
- ఈ నెల 18న బోకర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి
- బోకర్‌లో కాంగ్రెస్, బీజేపీల హోరాహోరీ
- భైంసాలో పొంగులేటి క్యాంపు

నిర్మల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు సరిహద్దున ఉన్న మహారాష్ట్ర పల్లెల్లో అక్కడి అసెంబ్లీ ఎన్నికల పర్వం జిల్లాలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా జిల్లా సరిహద్దున ఉన్న గ్రామాల మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న గ్రామాల ప్రజలకు బంధుత్వాలు, వ్యాపార సంబంధాలు, స్నేహ బంధాలు పెద్దఎత్తున ఉన్న కారణంగా మహారాష్ట్ర ఎన్నికల ఘట్టం చర్చనీయాంశంగా అవుతుంది. జిల్లాలోని సరిహద్దు గ్రామాల్లో ఎక్కువసంఖ్యలో తెలుగు మాట్లాడుతుంటారు. అయితే జిల్లా సరిహద్దులో ఉన్న బోకర్ నియోజకవర్గంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలు జిల్లా సరిహద్దుల్లో సైతం ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయి. ఈ నియోజకవర్గంలో మాజీ ముఖ్యమంత్రి అశోక్‌చౌహాన్ కూతురు శ్రీజచౌహాన్ బీజేపీ తరఫున పోటీ చేస్తుండగా కాంగ్రెస్ పార్టీ తరఫున తిరుపతి పప్పు కొండకేర్‌లు పోటీలో ఉన్నారు. గతంలో అశోక్‌చౌహాన్ కాంగ్రెస్ పార్టీ తరఫున మహారాష్ట్ర సీఎంగా వ్యవహరించారు. ఇటీవలే ఆయన పార్టీని వీడి బీజేపీలో చేరగా, మొన్నటి వరకు బీజేపీలో కొనసాగిన తిరుపతి పప్పుకొండేకర్ ఆ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. అశోక్‌చౌహాన్‌కు జిల్లా సరిహద్దు గ్రామాలతో ఎక్కువ సంబంధాలు ఉండడం అలాగే బంధువులు కూడా ఎక్కువగా ఉండడంతో వారి పరోక్ష సహకారాన్ని తన కూతురు కోసం పొందేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారు. బోకర్ ప్రాంతంలో తెలుగు ప్రజల సంఖ్య కూడా ఎక్కువగా ఉన్నందున వారి ఓట్ల కోసం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పోటీ పడుతున్నాయి. ఇరు పార్టీల అభ్యర్థులు తమ బంధువులను రంగంలోకి దింపుతున్నాయి.

### అగ్రనేతల రాక..

కాగా బీజేపీ బోకర్ నియోజకవర్గ అభ్యర్థి శ్రీజచౌహాన్ తరఫున ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం సినీనటుడు పవన్‌కల్యాణ్ శనివారం ఆ నియోజకవర్గంలో పాలజ్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారానికి జనం నుంచి మంచి స్పందన లభించడంతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంటోంది. సరిహద్దులో ఉన్న తెలుగు ఓటర్ల మద్దతును కూడగట్టే ఉద్దేశంతోనే బీజేపీ పవన్‌కల్యాణ్‌ను రంగంలోకి దింపింది. కిన్వట్ బీజేపీ అభ్యర్థి భీంరాంకేరాం తరఫున అప్పారావుపేట్, మలక్‌జామ్, శివిని, ఇస్లాపూర్‌తో పాటు తదితర గ్రామాల్లో బీజేఎల్పీ నేత ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. అలాగే నిర్మల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు అలూరి మల్లారెడ్డి మహారాష్ట్రలోని రాజురా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తరఫున ప్రచారం చేపట్టారు. ఇదిలా ఉండగా ఈ నెల 18న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తిరుపతి పప్పు కొండేకర్ తరఫున తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ఇప్పటికే సరిహద్దు గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. కాంగ్రెస్ తరఫున ముథోల్ మాజీ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, నారాయణరావు పటేల్‌లు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.

### కుల సమీకరణల పేరిట..

కాగా మహారాష్ట్రలోని సరిహద్దు గ్రామాల్లో ఎక్కువగా రెడ్డి, మున్నూరు కాపు సామాజిక వర్గాలు ఉండడంతో ఆ వర్గాల ఓట్లను మెజార్టీగా కైవసం చేసుకోవాలని కాంగ్రెస్, బీజేపీలు పోటీ పడుతున్నాయి. ఇందులో భాగంగానే ఆయా సామాజిక వర్గాలకు చెందిన నేతలను ఈ రెండు పార్టీలు తమ అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం కోసం రప్పిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తరఫున మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రచారం చేపట్టనున్నారు.

### సరిహద్దు గ్రామాల్లో సందడి..

నిర్మల్ జిల్లాతో పాటు మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న గ్రామాల్లో ప్రస్తుతం ఎన్నికల సందడీ హోరెత్తుతోంది. బాసర, ముథోల్, తానూర్, కుభీర్ మండలాల్లోని బిద్రెల్లీ, లాబ్ది, సింగన్‌గావ్, ఝరి, బామ్ని, నిగ్వ, వాయు, సిరిపెల్లి, డోదర్న, ప్రజలతో బోకర్ నియోజకవర్గంలోని ధర్మాబాద్, యాతాలం, మంగవెల్లి, కర్కెల్లి, దివిషి, బోకర్, కాండ్లి, పాలజ్, కిని, సావర్గాం తదితర గ్రామాల ప్రజలతో బంధుత్వాలు ఎక్కువగా ఉన్నాయి.

### భైంసాలో పొంగులేటి క్యాంపు..

కాగా బోకర్‌లో ఎలాగైనా గెలుపు సాధించాలన్న ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ పెద్దఎత్తున పావులు కదుపుతోంది. దీని కోసం గానూ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ప్రచార బాధ్యతలు అప్పగించింది. బోకర్ నియోజకవర్గానికి సమీపంలోని భైంసాలోనే పొంగులేటి మకాం వేసి ఎన్నికల క్యాంపును నిర్వహిస్తున్నారు. గ్రామాల వారిగా స్థానిక కార్యకర్తలతో పొంగులేటి టీంలు ఏర్పాటు చేసి ప్రచారపర్వాన్ని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. భైంసా అడ్డాగా ఆయన ఎన్నికల చివరిరోజు వరకు ఇక్కడే ఉండి గెలుపు దిశగా పావులు కదపనున్నారు. ఎన్నికల మేనేజ్‌మెంట్‌లో అనుభవం ఉన్న పొంగులేటికి తనదైనమార్క్‌తో ప్రచారం చేపట్టి కాంగ్రెస్ గెలుపు కోసం పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేయనుండడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. బీజేపీ వ్యూహాలకు ఎక్కడికక్కడ చెక్ పెడుతూ కాంగ్రెస్ పార్టీని గెలుపు దిశగా నడిపించే బాధ్యతను సైతం ఆ పార్టీ అధిష్ఠానం పొంగులేటిపై పెట్టిందని అంటున్నారు. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కూతురు ఇక్కడి నుంచి బీజేపీ తరఫున పోటీ చేస్తున్న కారణంగా ఆమెను ఓడించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ వ్యూహాలు రచిస్తోంది.





అప్పారావుపేట్‌లో బీజేఎల్పీ నేత ఏలేటీ మహేశ్వర్‌రెడ్డికి ఘన స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

# బాసరలో టెన్షన్ టెన్షన్

- ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ముట్టడికి ఏబీవీపీ పిలుపు
- జిల్లాల నుంచి విడతల్లో భారీగా కార్యకర్తల రాక
- ట్రిపుల్ ఐటీ చుట్టూ పోలీసుల వలయం
- రైల్వే స్టేషన్, జాతీయ రహదారిపై పోలీసుల విస్తృత తనిఖీలు



క్యాంపస్ ప్రధాన ద్వారం వద్ద భద్రతను పర్యవేక్షిస్తున్న ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ అవినాష్ కుమార్

బాసర, నవంబర్, 16 : (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీకి ఏబీవీపీ ముట్టడి పిలుపుతో శనివారం టెన్షన్ వాతావరణం నెలకొంది. స్వాతి ప్రియ అనే విద్యార్థి ఇటీవల ఆత్మహత్య చేసుకోవడం ఏబీవీపీ కార్యకర్తలపై ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ సిబ్బంది దాడి చేయడాన్ని నిరసిస్తూ ఏబీవీపీ క్యాంపస్ ముట్టడికి పిలుపునిచ్చింది. రాష్ట్రంలోని జిల్లాల నుంచి పెద్దఎత్తున ఏబీవీపీ కార్యకర్తలు బాసరకు వస్తున్నట్లు సమాచారం ఉండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రత్యేక బలగాలు ట్రిపుల్ ఐటీకి వలయంగా ఏర్పడి కాపలా ఉంచారు. ప్రవేశ ద్వారాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల, భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ ఆధ్వర్యంలో 300 ల మంది పోలీసులు ప్రత్యేక బలగాలను మొహరించారు. ఎస్పీ జానకీషర్మిల క్షేత్రస్థాయిలో మాకాం వేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు.

### ముమ్మర తనిఖీలు

ముట్టడి నేపథ్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ట్రిపుల్ ఐటీ నుంచి వెళ్లే ప్రతి వాహనాన్ని నిశితంగా తనిఖీలు చేపట్టారు. ఆర్టీసీ బస్సులను కూడా వదలలేదు. అనుమానిత వ్యక్తులను పూర్తి విచారణ చేశాకే పంపించారు. ట్రిపుల్ ఐటీ పరిసరాల్లో ఫోటోలకు, వీడియోలకు అనుమతి ఇవ్వలేదు. బాసర రైల్వేస్టేషన్‌లో సైతం సుమారు 100 మంది పోలీసులను మొహరించారు.

### ఉదయం నుంచే కొనసాగిన అరెస్టులు

వివిధ ప్రాంతాల నుంచి బాసర చేరుకున్న ఏబీవీపీ కార్యకర్తలన పోలీసులు అరెస్టు చేశారు. ఉదయం 5 గంటల నుంచే అరెస్టుల పర్వం ప్రారంభమైంది. వాహనాలు, రైళ్ల ద్వారా చేరుకున్న వారిని ముందస్తు నిఘాతో అదుపులోకి తీసుకున్నారు. ముట్టడికి కంటే ముందు అమ్మవారి దర్శనానికి వచ్చిన ఏబీవీపీ కార్యకర్తలను అమ్మవారి ఆలయంలో పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పోలీసులకు, ఏబీవీపీ కార్యకర్తలకు వాగ్వాదం జరిగింది. కనీసం దేవుడి దర్శనం చేసుకోనివ్వరా అంటూ ఏబీవీపీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైళ్ల ద్వారా దిగిన విద్యార్థులను స్టేషన్‌లోనే అరెస్టు చేశారు. 300లకు పైగా మంది కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకొని జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు అతీ సమీపాన నుండి రైల్వే ట్రాక్ ఉంది. రైల్ ద్వారా వచ్చిన సుమారు 50 మంది ట్రైన్ చైన్ లాగి ట్రిపుల్ ఐటీ వైపు పంటల పొలాల్లో నుండి పరుగెత్తారు. ట్రిపుల్ ఐటీ ప్రహారీ గోడ, కంచెను దాటి లోపలికి ప్రవేశించారు. వారనుకున్నది సాధించారు.





# వైభవంగా వెంకన్న రథోత్సవం

- కన్నుల పండువగా జాతర
- భారీగా తరలివచ్చిన భక్తజనం
- గోవింద నామస్మరణతో మార్మోగిన ఖానాపూర్




వెంకటేశ్వరస్వామి రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ సత్యం, ఆలయ కమిటీ బృందం

ఖానాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పద్మావతి నగర్‌లో గల శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి ఖానాపూర్‌లో వెంకటేశ్వరస్వామి రథోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ పురవీధులలో స్వామివారి రథాన్ని ఊరేగించారు. ఈ శోభాయాత్రలో భక్తులు చేసిన గోవింద నామస్మరణతో ఖానాపూర్ పట్టణ పురవీధులన్నీ పులకించిపోయాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారు జాము వరకు ఆలయ ఆవరణలో జాతర కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. యజ్ఞాచార్యులు శ్రీ చక్రపాణి నరసింహా మూర్తి ఆధ్వర్యంలో కొనసాగిన ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ కావలి సంతోష్, ఆలయ కమిటీ అధ్యక్షులు అడ్డగడ్ల రాజన్న, స్థానిక కౌన్సిలర్ కిషోర్ నాయక్ దంపతులు, మాజీ వైస్‌ఎంపీపీ తోట సత్యం, కాంగ్రెస్ నాయకులు పరిమి సురేష్, బీఆర్ఎస్ నాయకులు సిరిగారపు లింగన్న సహా పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. శనివారం ఉదయం యజ్ఞ పూర్ణాహుతి, సాయంత్రం స్వామివారి నాగవెల్లి, ఏకాంతోత్సవం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

## విఠలరుక్మిణి మాత జాతరకు పోటెత్తిన భక్తులు

- అలరించిన కుస్తీ పోటీలు



జాతరలో పాల్గొన్న భక్తులు.. ఇన్‌సెట్‌లో రథోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్థులు దృశ్యం

తానూర్, నవంబర్ 16 : తానూర్ విఠలేశ్వర ఆలయంలో కార్తీక పౌర్ణిమ జాతర ఉత్సవాలు శనివారం వైభవోపేతంగా ముగిశాయి. శుక్రవారం రాత్రి నిర్వహించిన రథోత్సవ శోభాయాత్ర గ్రామంలోని ప్రధాన వీధుల గుండా కన్నుల పండువగా కొనసాగింది. రథయాత్ర ప్రారంభం శోభాయాత్ర ప్రారంభానికి ముందు, విఠలరుక్మిణీ మాత ఆలయంలో వేద పండితులచే ప్రత్యేక పూజలు చేసి, రథానికి హారతి ఇచ్చి రథోత్సవం శోభయాత్ర ప్రారంభించారు. ఈ రథోత్సవ శోభాయాత్ర గత 107 సంవత్సరాలుగా కొనసాగుతుంది. ఈ శోభయాత్ర ప్రధాన వీధుల గుండా కొనసాగింది. మహిళలు మంగళ హారతులతో ఎదురెల్లి స్వాగతం పలికి ప్రత్యేకపూజలు చేశారు. తమకు సంతానం కలుగాలని నవ దంపతులు మొక్కులను కోరుకున్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడు కూడా మల్లయోదులు కుస్తీ పోటీల్లో తలబడ్డారు. తెలంగాణ రాష్ట్రంలోని నిర్మల్, అదిలాబాద్, నిజామాబాద్, భైంసాతో పాటు మహారాష్ట్ర లోని నాందెడ్, యావత్‌మాల్, ధర్మాబాద్, భోకర్, పూనే, కర్ణాటక నుంచి వచ్చిన మల్లయోదులు కుస్తీపోటీల్లో తలబడ్డారు. కుస్తీపోటీల్లో గెలుపొందిన మల్లయోధులకు మొదటి బహుమతి రూ. 11111, వెండి కడియం, రెండవ బహుమతి రూ. 8851లతో పూలమాలలతో సత్కరించి పురస్కారాలతో పాటు నూతన వస్త్రాలను బహుకరించారు. కార్యక్రమంలో తానూర్ మాజీ సర్పంచ్ తాడేవార్ విఠల్, ఆలయ కమిటీ చైర్మన్ పండరి, మాజీ సర్పంచ్‌లు మాధవరావుపటేల్, డి. రాములు, గ్రామస్థులు శివాజీరావు పటేల్, పీఏసీఎస్ డైరెక్టర్ పుండ్లీక్, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు, యువకులు, మండల వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆయుత చండీయాగానికి ప్రముఖులు



కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామితో చర్చిస్తున్న నిర్మల్ మున్సిపల్ చైర్మన్

నిర్మల్ కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లో నిర్వహిస్తున్న శ్రీ వైష్ణవ ఆయుత చండీ యాగానికి శనివారం మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ హాజరయ్యారు. కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యాగంలో ప్రతీ ఒక్కరూ పాల్గొనాలని కోరారు. యాగం నిర్మల్‌లో నిర్వహించడం అదృష్టమన్నారు. లోక కల్యాణానికి జరిగే యాగం మహోన్నతమని పేర్కొన్నారు. కౌన్సిలర్లు గండ్రత్ రమణ, నరహరి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కార్తీక దీపారాధన



ఖానాపూర్‌లని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక దీపాలు

ఖానాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శుక్రవారం రాత్రి కార్తీకపౌర్ణమి వేడుకలను భక్తులు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయం, నల్ల పోచమ్మ ఆలయం, ప్రసన్నాంజనేయస్వామి ఆలయంతో పాటు మండలంలోని తర్లపాడ్ గ్రామంలో గల ఓంకారేశ్వరస్వామి ఆలయం, దిలావర్‌పూర్ గ్రామంలోని శివాలయం, రంగపేట గ్రామంలోని రాజరాజేశ్వర స్వామి ఆలయాల్లో మహిళలు ప్రత్యేకపూజలు నిర్వహించి కార్తీక దీపాలను వెలిగించారు.

## ఘనంగా హనుమాన్ పండుగ

సోన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని న్యూ వెల్మల్ బొప్పారం గ్రామాల్లో శనివారం హనుమాన్ పండుగను ఘనంగా నిర్వహించారు. అనంతరం సల్ల గుంజ ఎక్కే కార్యక్రమానికి యువకులు పోటీపడ్డారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ హయాంలో అన్ని వర్గాలకు న్యాయం



కుంటాల, నవంబర్, 16 : (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ హయాంలోనే పేదబడుగు, బలహీన వర్గాల వారందరికి న్యాయం చేకూరుతుందని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన న్యాయవాది జక్కుల గజేం దర్‌ను కలిసేందుకు వచ్చారు. ఆదివారం రోజు న్యాయవాది పెళ్లి ఉన్నందున ముందస్తుగా శనివారం రోజు ఆయనను కలిశారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు.

# ఇచ్చోడలో ప్రయాణం.. యమ డేంజర్

- రోడ్డు పనులతో వాహనదారుల ఇక్కట్లు
- పదే పదే మొరయిస్తున్న వాహనదారులు
- అదుపు తప్పుతున్న వాహనాలు
- ఓ పక్క దుమ్ము.. మరోపక్క గుంతలు




కంకర రాళ్లలో పూర్తిగా ఇరుక్కుపోయిన వాహనాన్ని బయటికి తీసేందుకు నెడుతున్న స్థానికులు



కుమ్రం భీం చౌరస్తాలో ఇరుక్కుపోయిన లారీని బయటకు తీస్తున్న ప్రజలు

ఇచ్చోడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇచ్చోడలోని ప్రధాన రహదారి ఆదిలాబాద్ బైపాస్ రోడ్డు నుంచి నిర్మల్ బైపాస్ రోడ్డు వరకు రోడ్డు విస్తరణ పనులు ఏమో గానీ వాహనదారులు మాత్రం బెంబేలెత్తుతున్నారు. ఇచ్చోడ లో పలి నుంచి ప్రయాణం అంటేనే తలలు పట్టుకుంటున్నారు. రోడ్డుపై వేసిన కంకరలో పదే పదే వాహనాలు ఇరుక్కుపోతుండడంతో ఇచ్చోడ నుంచి ప్రయాణించడానికి ప్రజలు జంకుతున్నారు. చాలా మాసాల క్రితం ప్రారంభ మైన విస్తరణ పనులు ఇంకా పూర్తికాకపోవడంతో ఇంకెప్పుడు పూర్తవుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇచ్చోడ ప్రధాన రహదారిపై కంకర వేసి చదును చేసి వదిలేయడంతో ద్విచక్రవాహనాలు జారిపడుతున్నాయి. కార్లు, లారీలు కంకరలో కూరుకుపోతున్నాయి. ఇలా ద్విచక్ర వాహనదారులు జారి పడుతుండడంతో చిన్న పాటి గాయాలు తగులుతున్నాయి, కార్లు, ఆటోలు ఇరు క్కుపోవడంతో వాహనాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని వాహనదారులు వారి ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. పనులు నామమాత్రంగా సాగుతుండడంతో ప్రజలు ఈ దారిగుండా వెళ్లాలంటేనే భయపడుతున్నారు. అత్యవసరముంటేనే బయటకు వస్తున్నారే తప్ప రోడ్డుపైకి వచ్చే సాహసం చేయడం లేదు. రోడ్డు పనులతో వచ్చే దుమ్ముతో అనారోగ్యం పాలవుతున్నారు. దుమ్ముతో జలుబు, తుమ్ములు, ఎలర్జీ సంబంధిత శ్వాసకోస వ్యాదుల భారిన పడుతున్నారు. రోడ్డు పనులు సాగుతున్నాయే.. తప్ప ఏ ఒక్క అధికారి ఇటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు కనిపించడం లేదు. ఇకనైనా అధికారులు సమస్యనుపరిష్కరించాలని కోరుతున్నారు.

## పేద విద్యార్థికి రూ.50 వేల అందజేత

బోథ్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీకి చెందిన టేకులపల్లి మౌనికకు బీఎస్సీ నర్సింగ్‌లో సీటు రావడం జరిగింది. అయితే చేతిలో చిల్లిగవ్వలేదు. ఆ కుటుంబం దాతల ఆర్థిక సాయం కోసం ఎదురు చూశారు. అయితే సామాజిక మాధ్యమాలలో పత్రికలలో వార్తలు రావడంతో స్పందించిన ఫిలడెల్ఫియా తెలంగాణ అసోసియేషన్ వారు స్పందించారు. రూ.50 వేలను పంపించారు. చెక్కును లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు అనిల్ మాసం చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్టడీ సర్కిల్ నిపుణులు రమణగౌడ్, అల్లం సాయికృష్ణ చేతుల మీదుగా బాలికకు అందించారు. కార్యక్రమంలో తుల హరీష్, గంగాధర్, రమేష్, పోసాని కృష్ణ పాల్గొన్నారు.

## 19న కోలామి వికీపీడియా శిక్షణ శిబిరం

ఉట్నూర్, నవంబరు16 (ఆంధ్రజ్యోతి) ఉట్నూర్ మండల కేంద్రంలో బోలిచేతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో వికీపీడియా స్వేచ్ఛ విజ్ఞాన సర్వస్వం కోలామి వికీపిడియా శిక్షణ శిబిరాన్ని 19న నిర్వహిస్తున్నామని బోలిచేతో ఫౌండేషన్ బోర్డు సభ్యులు ఆత్రం మోతిరాం, సిడాం వరప్రసాద్‌లు తెలిపారు. శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉట్నూర్ మండల కేంద్రంలోని గిరిజన భవనంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో తెలంగాణ గ్రామీణ వ్యాసాలకు సంబంధించిన సమాచారాన్ని కోలామి వికీపీడియాలో చేర్చడం జరుగుతుందని కావున యువత పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కోలాం సేవా సంఘం నాయకులు ఆత్రం దేవ్‌రావ్ పాల్గొన్నారు.

## సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

నేరడిగొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) సామాజిక,ఆర్థిక, విద్య, ఉద్యోగ రాజకీయ, కులసర్వేను పకడ్బందీగా చేయాలని మండల స్పెషల్ అధికారి రవీందర్ అన్నారు. శనివారం నేరడిగొండ మండల కేంద్రంలో ఏనుమరేషన్ బ్లాక్(5)లో జరుగుతున్న సర్వేను మండల స్పెషల్ అధికారి రవీందర్ పరిశీలించారు. ఖచ్చితంగా ప్రతీ ఒక కుటుంబ సభ్యుల ద్వారా విషయాలు సేకరించి నిక్షిప్తంగా చేయాలన్నారు. ఇందులో ఎంపీడీవో రాజ్‌వీర్, ఎన్యూమరేటర్ సరిత ఉన్నారు.

## బాలికల హాస్టల్‌కు రక్షణ గోడ నిర్మించండి



బోథ్ మండల కేంద్రంలోని ఎస్టీ బాలికల వసతి గృహం వద్ద కూలిన ప్రహరీ

బోథ్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్టీ బాలికల వసతి గృహం చుట్టూ ఉన్న ప్రహరీ ముందు భాగం కూలిపోవడంతో బాలికల హాస్టల్‌కు రక్షణ లేకుండా పోయిందన్న విమర్శలు వస్తున్నాయి. హాస్టల్‌లో పదో తరగతి వరకు గిరిజన బాలికలు చదువుతున్నారు. అయితే హాస్టల్‌కు ఉన్న రక్షణ కూడా మూడు నెలల క్రితం కూలిపోయింది. దీంతో హాస్టల్ విద్యార్థుల రక్షణ కోసం బయట నుంచి వచ్చే పశువులు రాకుండా ఇతరులు ఎవరూ లోపలికి ప్రవేశించకుండా అడ్డు గోడగా గతంలో వినియోగించిన పాత గేట్లను అడ్డుగా పెట్టడం జరిగింది. అధికారులు తక్షణమే బాలికలు చదువుకునే పాఠశాలలకు ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు కేటాయించాలి

భీంపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ సంబంధిత నిధులు తక్షణమే కేటాయించాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం, ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం భీంపూర్ సీనియర్ అసిస్టెంట్ ఆర్.నర్సింలుకు యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మడవ గణేష్, జిల్లా ప్రతినిధులు మెస్రం మారుతితో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 నుంచి ఉన్న బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ ఏడాది నాలుగు లక్షల మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని వారికి ఏడాదికి మూడు వేల కోట్లు అవసరం అవుతాయన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పీడీఎస్‌యూ నాయకులు అంకిత్, అభిషేక్, నిఖిల్ తదితరులు ఉన్నారు.

## ఇదేం 'చెత్త' నిర్వహణ..

(5వ పేజీ తరువాయి)

లేకుండాపోయింది. ప్రస్తుతం కులగణన సర్వే కొనసాగుతుండడంతో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు మరింత బిజీబిజీగా మారారు. దీంతో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ మరింత అధ్వానంగా మారుతోంది. డంపింగ్ యార్డుల వైపు కనీసం కన్నెత్తి చూడక పోవడంతో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరిగిపోయి చిట్టడవిని తలపిస్తున్నాయి. నెలలో ఒక్కసారి కూడా డంపింగ్ యార్డులను సందర్శించిన దాఖలాలు కనిపించడం లేదు. దీన్ని బట్టి చూస్తుంటే గ్రామాల్లో గ్రామ కార్యదర్శుల పని తీరు ఏ విధంగా ఉందో తెలుస్తూనే ఉంది. డంపింగ్ యార్డులలో చెత్తకు నిప్పుపెట్టడంతో గాలి కలుషిత పోయి ఊపిరి పీల్చుకోవడమే కష్టంగా మారుతోంది. తడిచెత్త పేరుకు పోవడంతో కంపు కొడుతూ ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. గ్రామ పరిసర ప్రాంతాలలో నిర్లక్ష్యంగా చెత్తను వేయడంతో పశువులు తిని అనారోగ్య భారిన పడుతున్నాయి. కొన్ని సందర్భాల్లో పశువులు మృత్యువాత పడుతున్న దాఖలాలు కూడా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. డంపింగ్‌యార్డుల నిర్వహణపై అడిగే వారే లేక పోవడంతో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను గాలికి వదిలేస్తున్నారు.

## లోక కల్యాణార్థం పాదయాత్ర

ఇచ్చోడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బద్రినాథ్ థామ్ అహింస సంస్కార్ పాదయాత్ర శనివారం రోజున ఇచ్చోడకు చేరుకుంది. తెలంగాణ రాష్ట్రంలోని మెదక్ జిల్లా కూల్చారం నుంచి ఈ నెల 7వ తేదీన ప్రారంభమైన పాదయాత్ర శనివారం ఆదిలాబాద్ జిల్లాలోని ఇచ్చోడకు చేరుకుంది. లోక కల్యాణార్థం చేస్తున్న ఈ పాదయాత్రలో భాగంగా ఇచ్చోడ మండల కేంద్రంలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో రాత్రి ప్రవచనాలు బోధించారు. అనంతరం ఇక్కడే బస చేసి ఆదివారం ఉదయం తిరిగి మళ్లీ పాదయాత్రలో పాల్గొంటారు. ఈ సందర్భంగా దిగంబరాలు మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర మహరాష్ట్ర మీదుగా బద్రీనాథ్ వరకు దాదాపు 2196 కిలో మీటర్ల పాదయాత్రగా వెళ్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 16మంది డిగంబరాలు ఉన్నారు. వారి వెంట వారికి సరిపడా సామాగ్రి వెంట ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

## ప్రభుత్వ ఉద్యోగాలు కాంగ్రెస్‌తోనే సాధ్యం



ఉద్యోగాలు సాధించిన యువతను సన్మానిస్తున్న గణేష్‌రెడ్డి, గ్రామస్థులు

తలమడుగు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఖోడద్ గ్రామంలో గ్రూప్-4 లో ఇద్దరికి సాకే ప్రవీణ్, మిటిపెల్లి సంతోష్‌లకు, డీఎస్సీలో ఉపాధ్యాయుడిగా నల్ల ప్రశాంత్‌లకు ఉద్యోగాలు సాధించడంతో వారిని గ్రామస్థుల ఆధ్వర్యంలో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. కేవలం నాయకులకే పదవులు వచ్చాయన్నారు. అనంతరం అదే గ్రామానికి చెందిన రాగం పోతన్న సీమణి ప్రమాదంలో చేతు విరగడంతో వారిని, శిశిలే కంసాల బాయి హైదరాబాద్‌లో సర్జరీ చేసుకుని ఇంటికి రావడంతో వారిని గజ్జల శివక్క హైదరాబాద్‌లో బ్రెయిన్ సర్జరీ చేసుకుని ఇంటికి రావడంతో వారిని పరామర్శించిన మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కల్యాణం లక్ష్మీ రాజేశ్వర్ వారితో పాటు మాజీ సర్పంచ్‌లు సాకే ఆనంద్, పురుషోత్తం, మాజీ ఎంపీటీసీ వెంకన్న యాదవ్, మాజీ కో ఆప్షన్ మెంబర్ బాబు ఖాన్, మాజీ ఉప సర్పంచ్ నారాయణరెడ్డి, విలాస్ యాదవ్, రావుల నారాయణ, పన్నాల భోజారెడ్డి, మోహన్‌రెడ్డి, గంగారెడ్డి, దేవిదాస్, మంత్రి సంతోష్, సుదర్శన్, బాబురావు, గంగన్న తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వం తీసుకున్న రూ. 42 కోట్లు ఇప్పించండి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి బాసర వాసుల విన్నపం
- అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు
- వెనక్కి వెళ్లిన నిధులు ఇప్పించేందుకు భరోసా
- భద్రాద్రి తరహాలోనే బాసరను అభివృద్ధి చేస్తామని మంత్రి హామీ



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ ఈవో విజయ రామరావు

బాసర, నవంబర్, 16 : (ఆంధ్రజ్యోతి) : బాసర సరస్వతీ అమ్మవారి పుణ్యక్షేత్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.42 కోట్ల నిధులను ప్రభుత్వం మళ్లీ వెనక్కి తీసుకుందని వీటిని తిరిగి ఇప్పించాలని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి శనివారం బాసర వాసులు విజ్ఞప్తి చేశారు. శనివారం బాసర అమ్మవారి ఆలయాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. ఆల యానికి చేరుకున్న మంత్రికి ఆలయ పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, పండితులు, స్థానికులు బాసర అభివృద్ధి విషయాన్ని మంత్రి దృష్టికి తెచ్చారు. గత ప్రభుత్వం రూపాయలు 50 కోట్లు మంజూరు చేసిందని అందులో 8 కోట్లు వివిధ పనులు చేపట్టగా మిగిలిపోయిన 42 కోట్ల నిధులను ఈ ప్రభుత్వం వెనక్కి తీసుకుందని మంత్రితో చెప్పారు. నిధులు వెనక్కి వెళ్లడంతో అమ్మవారి ఆలయ అభివృద్ధి నిలిచిపోయిందని వాటిని తిరిగి ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. దేశంలోనే ఉన్న రెండు ప్రాచీన దేవాలయాల్లో బాసర ఒకటని ఇక్కడ సరైన వసతులు లేక భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆలయ విస్తరణ చేపడితే భక్తులకు సౌకర్యంగా ఉంటుందని వివరించారు. అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించే సమయంలో నిధులు వెనక్కి వెళ్లాయని తిరిగి ఇప్పించాలని కోరారు. అనంతరం మంత్రి విలేకరులతో భద్రాచలం తరహాలోనే బాసర సరస్వతీ అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ఈ ప్రభుత్వం ముందుంటుందని హామీ ఇచ్చారు. మంత్రి వెంట మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, బాసర మాజీ సర్పంచ్ ఎం. రమేష్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, బాసర మండల నాయకులు సంజీవరావు దేశాయ్, జంగం రమేష్, రాందాస్, తదితరులు ఉన్నారు.

### మంత్రి పొంగులేటిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

సారంగాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ నియోజకవర్గంలో పర్యటనలో భాగంగా శనివారం భైంసాలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగిలేటికి జడ్పీటీసీల సభ్యుల ఫోరం జిల్లా అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శాలువాతో సన్మానం చేసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట సారంగాపూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దశరథ్ రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జడ్పీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను సాఫీగా నిర్వహించాలి : నిర్మల్ కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు ప్రక్రియను సాఫీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్‌తో కలిసి అధికారులు, రైస్ మిల్లర్లతో కలెక్టర్ వేరువేరుగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. సంబంధిత ప్రతి అధికారి క్షేత్ర స్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రిపోర్టులను వెంట వెంటనే తమకు అందజేయాలని ఆదేశించారు. ప్రతి రైతు ప్యాడిక్లీనర్ల ద్వారా తమ ధాన్యాన్ని శుభ్రం చేసి అమ్మే విధంగా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్‌వో కిరణ్ కుమార్, డీఎం వేణుగోపాల్, డీసీవో రాజమల్లు, రైస్ మిల్లర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### తేమ శాతాన్ని నమోదు చేయాలి

ముథోల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వరి కొనుగోలు కేంద్రంలో రైతుల వరి ధాన్యానికి సంబంధించి రోజువారీగా ధాన్యం తేమ శాతాన్ని నమోదు చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మండల కేంద్రం లోని ముథోల్‌లో గల పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని ఆష్ట, రువ్వి, విట్టోలి, బ్రహ్మన్ గాం గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ శ్రీకాంత్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో కిరణ్‌కుమార్, డీఏవో అంజిప్రసాద్, ఏడీఏ వినయ్‌బాబు, తహసీల్దార్ శ్రీకాంత్, పీఎస్ సీఎస్‌సీవో సాయరెడ్డి, ఏసీవో నాగేశ్వరరావు, ఆర్ఐ నారాయణరావు పటేల్, రైతులు, తదితరులు ఉన్నారు.

### నవంబరు 18న జరిగే ప్రజావాణి కార్యక్రమం రద్దు

గూప్- 3 పరీక్షలు, సమగ్ర కుటుంబ సర్వే నేపథ్యంలో ఈ నెల 18న (సోమవారం) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాఓలని అధికారులు, సిబ్బంది గ్రూప్-3 పరీక్షల నిర్వహణ, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే విధులలో ఉన్నందున అధికారులెవరూ అందుబాటులో ఉండరని తెలిపారు. కావునా జిల్లా ప్రజలు ఇట్టి విషయాన్ని గమనించి ఈ సోమవారం ప్రజావాణి దరఖాస్తులతో కలెక్టరేట్ కార్యాలయానికి రావద్దని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.



## వంకతుమ్మ అడవుల్లో ఆవుల మందపై పెద్ద పులి దాడి

ఉట్నూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా ఉమ్మడి జిల్లాలోని అడవుల్లో సంచరిస్తున్న పెద్దపులి ఎట్టకేలకు ఉట్నూర్ వంకతుమ్మ అడవుల్లో ప్రత్యక్షమైంది. శనివారం సాయంత్రం వంకతుమ్మ ప్రాంతంలోని అడవుల్లో ఆవుల మందపై దాడి చేయగా నాలుగు ఆవులు గాయపడినట్లు ప్రత్యక్ష సాక్షుల ద్వారా తెలుస్తుంది. శుక్రవారం వంకతుమ్మకు చెందిన గిరిజనుడు ఆత్రం గణపతికి చెందిన ఆవును హతమార్చగా అడవిలో తప్పిపోయిందని భావించిన గిరిజనులకు శనివారం ఆవుల మందపై దాడి చేయడంతో నాలుగు ఆవులకు తీవ్ర గాయాలయినట్టు తెలుస్తుంది. వంకతుమ్మకు చెందిన కోట్నాక్ రాంశావ్, కుమ్రదేవరావు, చాకటి సోనేరావులకు చెందిన ఆవులు గాయాలకు గురైనట్టు ఆ గ్రామ గిరిజనుడు తోడ సందూర్ షావ్ తెలిపారు. వంకతుమ్మ అడవుల్లోకి వెళ్లిన అటవీశాఖ సిబ్బంది సైతం పులి వచ్చినట్టు గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఏదిఏమైనా వంకతుమ్మ అడవుల్లోకి పెద్దపులి రావడంతో ఉట్నూర్ ప్రాంతంలోని అటవీ ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

## మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి




మహారాష్ట్రలో ప్రచారం చేస్తున్న బీజేఎల్పీ నేత

నిర్మల్ అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర ఎన్నికల్లో భాగంగా శనివారం కిన్వట్ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి భీమ్‌రావు కేరాంకి మద్దతుగా అప్పారావుపేట్, మలక్ జాంబ్, కంచ్లీ, అంధ్బోరి, అంధ్బోరి తండా, గోండ్ మహగావ్, చిక్లి, షివిని, దయాళ్ ధనోర, జల్దార, దయాళ్ ధనోర తండా గ్రామాల్లో ప్రచారంలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, నిర్మల్ జిల్లా బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 20వ తేదీన మహారాష్ట్రలో జరిగే అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మహారాష్ట్రలోని కిన్వట్ నియోజకవర్గంలో శనివారం బీజేపీ అభ్యర్థి భీమ్ రావు కేరాంకు మద్దతుగా బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రచారంలో పాల్గొని ప్రజలతో మాట్లాడారు దేశాభివృద్ధి కోసం శివసేవ బీజేపీ కూటమి అభ్యర్థిని గెలిపించాలన్నారు. బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఈయన వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

## ఖానాపూర్‌లో దొంగల హల్‌చల్

ఖానాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్‌లో శుక్రవారం రాత్రి పట్టణంలో దొంగలు ఒక ఇంట్లో దొంగతనం చేసి రూ. 10 వేల నగదును అపహరించుకుపోగా మరో రెండు ఇళ్లల్లో దొంగత నానికి ప్రయత్నించి విఫలమయారు. వివరాల్లోకి వెళ్తే ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన కథనం ప్రకారం... శుక్రవారం రాత్రి విద్యానగర్ కాలనీకి చెందిన ముక్కెర రాజేశ్వర్‌గౌడ్, అనే వ్యక్తి తన ఇంట్లోపై పోర్షన్‌లో గల గదికి తాళం వేసి వేరే గదిలో పడుకున్నాడు. ఉదయం లేచేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉండగా పరిశీలించిన బాధితులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెళ్లి చూసే సరికి ఇంట్లో ఉన్న పర్సుతో పాటు అందులో ఉన్న రూ. 10 వేల నగదును, ఇతర కార్డులు, సామాగ్రిని దొంగిలించినట్లు తేలింది. రాజేశ్వర్ ఇంటి సమీపంలోని మరో రెండు ఇళ్లలో సైతం దొంగతనానికి ప్రయత్నించి దొంగలు విఫలమయ్యారు. ఆ రెండు ఇళ్లల్లో ఎటువంటి నగదు గాని సామాగ్రి పోలేదని ఎస్సై తెలిపారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



● బోథ్ మండలం సొనాల జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఆరోగ్య పాఠశాల కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, అధికారులు



● ఆరోగ్య పాఠశాల లోగో

# ఆదిలాబాద్‌లో.. ఆరోగ్య పాఠశాలలు

- రాష్ట్రంలోనే తొలిసారిగా జిల్లాలో 'ఆరోగ్య పాఠశాల' ప్రారంభం
- ఉన్నతమైన భవిష్యత్తు కోసం ఆరోగ్యకమైన అలవాట్లు అంటూ ప్రచారం
- ప్రభుత్వ పాఠశాలల్లో నూతన కార్యక్రమానికి శ్రీకారం
- ప్రతిరోజూ ప్రార్థన సమయంలో ఆరు అంశాలపై అవగాహన
- విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యంగా ముందుకు..
- కార్యక్రమం అమలు తీరుపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి
- జిల్లావ్యాప్తంగా 107 ఉన్నత పాఠశాలలు, 18 కేజీబీవీలు, 6 మోడల్ స్కూళ్లు, 13 జూనియర్ కళాశాలల్లో అమలు

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు పెద్దలు.. ఆరోగ్యం బాగుంటేనే సకల ఐశ్వర్యాలు ఉన్నట్లే.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్యం బాగుంటే విద్యార్థులు మంచి పౌరులుగా ఎదుగుతారు. ఇందుకోసమే.. ఆదిలాబాద్ జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది.. జిల్లా కలెక్టర్ రాజర్షిషా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక చొరవ తీసుకుని ఆరోగ్య పాఠశాలల పేరిట నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లా విద్య, వైద్య శాఖలతో పాటు ఇతర శాఖల అధికారులతో ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రత్యేక రూపకల్పన చేశారు. నిరంతరం ఈ ప్రక్రియ సాగే విధంగా చర్యలు చేపడుతున్నారు. విద్యార్థి ఆరోగ్యంగా ఉంటేనే పాఠశాలకు క్రమం తప్పకుండా వస్తారని, చదువుపై దృష్టి సారిస్తారనే ఉద్దేశంతో ముందుకెళ్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత, కేజీబీవీలు, ప్రభుత్వ కళాశాలల్లో ప్రతీ రోజు ప్రార్థన సమయంలో విద్యార్థులకు 6 అంశాల గురించి తెలియజేయనుండగా, రోజుకో అంశం గురించి వివరించనున్నారు. బాలల దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాలల దినోత్సవం నుంచి ప్రారంభమైన ఈ వినూత్న కార్యక్రమంలో, ఆదిలాబాద్ జిల్లాలో వేలాది మంది విద్యార్థులు ఇప్పుడు ఆరోగ్య పాఠశాలకు హాజరవుతున్నారు. పాఠశాలలో నిర్వహించే ప్రార్థన సమయంలో ప్రతీ రోజు 15నిమిషాల పాటు వారికి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం గురించి అవగాహన కల్పించే లక్ష్యంతో ఉపాధ్యాయులు పాఠాలు చెబుతారు.

## రోజుకొక అంశంపై అవగాహన

ఈ ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ప్రతీరోజు ఉదయం ప్రార్థన అనంతరం టీచర్లతో పాటు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రతీవారం ఒక్కో అంశంపై అవగాహన కల్పిస్తారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న హై స్కూళ్లు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లతోపాటు ప్రభుత్వ కళాశాలల్లో కార్యక్రమం ఉంటుంది. జిల్లాలో 107 ఉన్నత పాఠశాలలు, 18 కేజీబీవీలు, 6 మోడల్ స్కూళ్లు, 13 జూనియర్ కళాశాలల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ఆరు అంశాలను తయారు చేశారు. ఉదయం ప్రార్థన సమయంలో విద్యార్థులకు రోజుకో అంశం గురించి తెలియజేయనున్నారు. సోమవారం వ్యక్తిగత పరిశుభ్రత, మంగళవారం పోషకాలు, బుధవారం ఒత్తిడి నిర్వహణ, గురువారం డ్రగ్ రహిత, శుక్రవారం కాలానుగుణత వ్యాధులు నివారణ, శనివారం వ్యక్తిత్వ దినోత్సవాలను నిర్వహించనున్నారు.



● తాంసిలోని జడ్పీ పాఠశాలలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, పాల్గొన్న విద్యార్థులు

### ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తాం

: ప్రణీత, జిల్లా విద్యా శాఖ అధికారి, ఆదిలాబాద్



జిల్లా కలెక్టర్ రాజర్షిషా ప్రత్యేకశ్రద్ధతో ఆరోగ్య పాఠశాలలు రూపుదిద్దుకున్నాయి. ప్రతి పాఠశాలలో ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ అమలయ్యేలా కృషి చేస్తాం.. అందుకోసం క్షేత్రస్థాయిలో ఆరోగ్య, విద్య శాఖలు సమన్వయంతో పని చేస్తాం.. ఈ కార్యక్రమంపై నిరంతరం పర్యవేక్షణ ఉంచుతాం.

### ఆరోగ్య పాఠశాలలతో ఎంతో మేలు


: భేదోడ్కర్ సతోష్ కుమార్, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, తోషం



జిల్లాలో ఏర్పాటైన ఆరోగ్య పాఠశాలలతో విద్యార్థులకు ఎంతో మేలు చేకూరనున్నది. ఆరోగ్యంగా ఉంటేనే చదువులు ఒంట బడతాయి. ఈ దిశగా సర్కారు బడుల విద్యార్థులు ఆరోగ్యంతో ఆహ్లాదంగా ఉంటూ శ్రద్ధగా చదువులు కొనసాగించగలుగుతారు.. దీంతో ఆరోగ్య పాఠశాలలు ఆదర్శ పాఠశాలలుగా నిలుస్తాయి.

# కంది పంట రైతులను ఆదుకునేనా?!

● ఆశాజనకంగా పంట ● తప్పని అడవి పందుల బెడద ● ఆందోళనలో అన్నదాతలు



● విరబూసిన పూతతో కంది పంట

తాంసి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పత్తి పంట ఎలాగూ రైతులకు ఆదుకోలేకపోయింది. కనీసం కంది పంట అయిన ఆదుకుంటుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కంది పంటను చూస్తే తమను ఆదుకునేలా కనిపిస్తుందని రైతులు అంటున్నారు. ఈ యేడు తాంసి మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో సుమారు 8వందల హెక్టార్లలో కంది పంటను సాగు చేస్తున్నారు. ప్రసుత్తం ఏ పంట పొలంలో చూసిన కంది పంట పూతతో నిండుగా కనిపిస్తుంది. గత రెండు రోజుల నుంచి వాతావరణంలో మార్పులు సంభవించడంతో కొంత పురుగు ప్రభావం సోకిందని రైతులు పేర్కొంటున్నారు. మొత్తం మీద కంది పంటను చూసి రైతుల్లో కొంత సంతోషం వ్యక్తం అవుతుందని చెప్పవచ్చు.

**● అప్పుడే అడవి పందుల బెడద**

పచ్చగా పూతతో కనిపిస్తున్న కంది పంటపై అప్పుడే అడవి పందుల బెడద తీవ్రమవుతోంది. ఏ పంట పొలంలో చూసిన కంది పంటను తింటున్నాయని రైతులు అంటున్నారు. అంతేకాకుండా నివారణకు సరైన చర్యలు అధికారులు చేపట్టక పోవడం తమకు కొంత నష్టాన్ని కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### మార్కెట్‌లో గిట్టుబాటు ధర కల్పించాలి

: వెంకన్న, రైతు, తాంసి



కంది పంటకు ఆదిలాబాద్ మార్కెట్‌లో సరియైన గిట్టుబాటు ధరను కల్పించాలి. తమను ఆదుకుంటుంది అనుకున్న పత్తి పంట తీవ్ర నష్టాలకు గురి చేసింది. తమ దృష్టి మొత్తం కంది పంటపైనే ఉంది. ప్రస్తుతం పూత దశకు చేరుకుంది. ప్రస్తుతం పంటను చూస్తే ఎకరానికి 8నుంచి 10క్వింటాళ్ల దిగుబడి వచ్చేలా కనిపిస్తుంది. ఈ పంటతోనైనా తమ కష్టాలు తీరుతాయని అనుకుంటున్నాం. అధికారులు ప్రభుత్వం కనీసం క్వింటాలుకు రూ.12 వేలు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలి.





● జిల్లాకేంద్రంలో అసంపూర్తిగా కనిపిస్తున్న సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు

ఆంధ్రజ్యోతి ఫోకస్

# అసంపూర్తిగా.. సమీకృత మార్కెట్ పనులు

● నిలిచి పోయిన నిర్మాణ పనులు ● వృథాగా మారుతున్న రూ.కోట్ల నిధులు ● అయినా.. పట్టించుకోని పాలకులు, ప్రజాప్రతినిధులు

ఆదిలాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు మార్కెట్ అందుబాటులో ఉండే విధంగా సకల సౌకర్యాలతో సమీకృత మార్కెట్ యార్డు నిర్మాణానికి పునాదులు వేశారు. కాని రెండేళ్లు గడుస్తున్నా, పనులు అసంపూర్తిగానే కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో దీని నిర్మాణానికి గాను రూ.7కోట్ల 10లక్షల నిధులను కేటాయించారు. ప్రారంభంలో హడావుడిగా పనులను ప్రారంభించిన ఆ తర్వాత కాంట్రాక్టర్ పనులను పూర్తిగా నిలిపి వేశారు. పనులకు సంబంధించిన బిల్లులు చేతికి రాకపోవడంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రాకపోవడంతోనే నిధుల మంజూరులో తీవ్ర జాప్యం జరిగిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సమీకృత మార్కెట్ ఉపయోగం నిర్మాణ పనుల తీరుపై అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. కానీ ప్రభుత్వం స్పందించక పోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. పిల్లర్లు పూర్తి చేసి కొంత వరకు స్లాబులు వేసి వదిలేయడంతో నిరుపయోగంగానే మారింది. సమీకృత మార్కెట్ పనులను పూర్తి చేస్తే పట్టణంలోని తోపుడుబండ్ల ట్రాఫిక్ సమస్యతో పాటు అన్ని రకాల కూరగాయలు, మాంసం, చేపలు, పండ్ల మార్కెట్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది. అయితే ప్రస్తుతం నిర్మాణ పనులు పూర్తిగా నిలిచి పోవడంతో సమీకృత మార్కెట్ కార్యాలయ పరిసరాలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్నాయి. మున్సిపల్ అధికారులు పట్టించుకోక పోవడంతో పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు పెరిగి అధ్వానంగా కనిపిస్తుంది. కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన నిర్మాణాలు నిరుపయోగంగానే మారాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోక పోవడంతో ప్రజాధనం వృథాగా మారుతుందన్న విమర్శలు సర్వత్రా వినవస్తున్నాయి.



# కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే.. విచ్ఛిన్న శక్తులే రాజ్యమేలుతాయి

● మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



అప్పారావుపేట్ గ్రామంలో బీజేపీ అభ్యర్థి తరపున ప్రచారం చేపట్టిన మహేశ్వర్ రెడ్డి

నిర్మల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే విచ్ఛిన్న శక్తులే రాజ్యమేలుతాయని బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా కిన్వట్ అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి భీమ్ రావు కేరాంకు మద్దతుగా అప్పారావుపేట్‌లో మహేశ్వర్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన తెలంగాణ బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డికి పార్టీ శ్రేణులతో పాటు ప్రజలు ఘన స్వాగతం పలికి బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తాజాగా కుల గణన సర్వేపై మాట్లాడుతూ.. బీసీలకు న్యాయం చేసేందుకే సర్వే నిర్వహిస్తున్నట్లు ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. భారత దేశాన్ని కాంగ్రెస్ పాలించిన సమయంలో బీసీలకు రాహుల్ గాంధీ చేసింది ఏమిటో ఒకసారి ప్రజలకు స్పష్టంగా చెప్పాలన్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి తప్పుడు మాటలు, బూటకపు హామీలే కాంగ్రెస్ విధానంగా మారిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనూ అదే జరిగిందని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో 420 హామీలను ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చాక హామీలను అమలు చేయాల్సిన ప్రభుత్వం 11 నెలలుగా అన్ని వర్గాల ప్రజలను మోసగిస్తుందన్నారు. రుణమాఫీ పేరిట గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో కొంతమందికి మాత్రమే రుణమాఫీ చేసిందన్నారు. ఇంకా రుణమాఫీ కానీ ఎందరో రైతులు కాంగ్రెస్ ప్రభుత్వ విధానంపై మండిపడుతున్నారన్నారు. రైతు భరోసా ఇప్పటి వరకు రైతులకు అందడం లేదన్నారు. రైతు పండించిన పంటకు బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నారన్నారు. మహిళలకు రూ. 2,500, ఆసరా పింఛన్లు రూ.4 వేలకు పెంపు, కళ్యాణలక్ష్మిలో రూ.లక్షతో పాటు తులం బంగారం, నిరుద్యోగ యువతకు భృతి ఇలా 420 హామీలను ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ తెంగాణలో ఏ ఒక్క హామీని కూడా సరిగ్గా అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. అధికార కాంక్షతో ఇష్టారీతిన హామీలను ఇచ్చి తెలంగాణలో ప్రభుత్వ పగ్గాలను చేపట్టిన కాంగ్రెస్ మాయమాటలతో కాలం వెల్లదీస్తోందన్నారు.

# సబ్ కా సాత్ సబ్ కా వికాస్ కోసం బీజేపీనే గెలిపించండి


● దేశ రక్షణ బీజేపీతోనే సాధ్యం ● మహారాష్ట్రలోని పాలాజ్ బహిరంగ సభలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ● భారీగా తరలి వచ్చిన అభిమానులు



● పాలాజ్ బహిరంగ సభలో మాట్లాడుతున్న పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్

కుబీర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సబ్ కా సాత్ సబ్ కా వికాస్ బీజేపీతోనే సాధ్యమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. శనివారం కుబీర్ మండలానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మహారాష్ట్రలోని పాలాజ్ గ్రామంలో మహారాష్ట్ర ఎన్నికల్లో భాగంగా నాందెడ్ జిల్లా బీజేపీ ఎంపీ అభ్యర్థి అడ్వకేట్ శ్రీజయ చవాన్ల గెలుపు కోసం బహిరంగ సభలో పాల్గొని అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం చేశారు. సనాతన ధర్మం, దేశరక్షణ బీజేపీతోనే సాధ్యమని అన్నారు. ఆర్టికల్ 370 రద్దు, దేశ ప్రజల కల అయోధ్య రామ మందిరం నిర్మాణంతో పూర్తయిందని పేర్కొన్నారు. బీజేపీ అంటే మతతత్వ పార్టీ కాదని, మానవత్వ పార్టీ అని అన్నారు. బంగ్లాదేశ్, పాకిస్తాన్ దేశాల్లో హిందువులకు రక్షణ లేదని, అదే మన దేశంలో ఇతర మతాల హీరోలను మన దేశ ప్రజలు అభిమానిస్తారని అన్నారు. బహిరంగ సభలో అభిమానులు కేకలు వేయడంతో మీరంతా సరిహద్దు తెలంగాణ వాసులని అర్థమైందన్నారు. తెలంగాణ ఉద్యమ గడ్డ అని బండెనుక బండి గట్టి పదహారు బండ్లు గట్టి అని పాట పాడారు. మహారాష్ట్రలో సనాతన ధర్మం రక్షణ కోసం ఛత్రపతి శివాజీ మహారాజ్, బాల్‌థాక్రే చేసిన సేవలను కొనియాడారు. దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 10 సంవత్సరాలు చేసిన అభివృద్ధి కాదు.. వచ్చే 5 సంవత్సరాల్లో జరిగే అభివృద్ధిని చూడాలని మహారాష్ట్ర ప్రజలను కోరారు. కమలం గుర్తుకు ఓటు వేసి బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. బహిరంగ సభలో మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్‌రావ్ చవాన్, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీజయ ఓటర్లను ఉద్దేశించి మాట్లాడారు. ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామరావుపాటిల్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పవన్‌కళ్యాణ్ పాలాజ్ సత్యగణేష్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నాయకులతో మాట్లాడి.. ఆలయ చరిత్ర అడిగి తెలుసుకున్నారు. ఆలయ కమిటీ నాయకులు పూలమాలలతో సత్కరించి, తీర్థప్రసాదాలను అందించారు.

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.2; కనిష్ఠం 16.8



# ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
ఆదివారం 17 నవంబరు 2024

## విద్యార్థులకు సమస్యలు లేకుండా చూడాలి

నార్నూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆదివాసీ ప్రాంతంలో ఉన్న పాఠశాల విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని ఆదివాసీ విద్యార్థి సంఘం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావు అన్నారు. శనివారం గాదిగూడ మండలం ఆశ్రమ పాఠశాలలో సందర్శించి తినే తిండి ఆరోగ్య ఇతరాత్ర విషయాలు విద్యార్థులతో వారి అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులు పట్ల అన్ని రంగాలు వారికి సహకరించాలని సూచించారు




గిరిజన రైతుల అక్రమ అరెస్టుపై ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే

## ఎస్సీ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసిన బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల గ్రామ రైతులను అక్రమంగా అరెస్టు చేసి సంగారెడ్డి జైల్లో పెట్టిన సందర్భంగా లగచర్ల గిరిజన రైతుల అక్ర మ అరెస్టుపై ఎస్సీ ఎస్టీ కమిషన్‌కు బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఫిర్యాదు చేశారు. వీరితో పాటు బీఆర్ఎస్ నాయకులున్నారు.



# ఇదేం చెత్త నిర్వహణ!

- జిల్లాలో నిరుపయోగంగా మారిన డంపింగ్ యార్డులు
- చెత్తకు నిప్పుపెట్టి చేతులు దులుపుకుంటున్న పంచాయతీ సిబ్బంది
- కంపుకొడుతున్న గ్రామ పరిసర ప్రాంతాలు
- చోద్యం చూస్తున్న జిల్లా ఉన్నతాధికారులు


● ఇచ్చోడ గ్రామ పంచాయతీ పరిధిలో కనిపిస్తున్న చెత్త కుప్ప



ఆదిలాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను మరింత పకడ్బందీగా చేపట్టేందుకు గత ప్రభుత్వ హయాంలో ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో డంపింగ్‌యార్డును నిర్మించారు. అధికారుల నిర్లక్ష్యంతో అవి నిరుపయోగంగానే మారాయి. నిర్వాహణ సక్రమంగా లేక పోవడంతో ఎక్కడ వేసిన చెత్త అక్కడే అన్న చందంగా కనిపిస్తుంది. పంచాయతీ పాలక వర్గాల పదవీకాలం ముగిసి పోవడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. చెత్త సేకరణపై అధికారులు నిండునిర్లక్ష్యమే చూపడంతో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది. చాలా గ్రామాల్లో డంపింగ్‌యార్డుల నిర్మాణాలు శిథిలాలుగా మారి దర్శనమిస్తున్నాయి. జిల్లాలో 468 గ్రామ పంచాయతీలు ఉండగా నాలుగైదు పంచాయతీల్లోనే డంపింగ్ యార్డుల నిర్వాహణ సక్రమంగా కన్పిస్తోంది. మిగితా చోట్ల నిరుపయోగంగా మారి కనిపిస్తున్నాయి. గ్రామాల్లో సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించేందుకు ట్రాక్టర్లతో పాటు మల్టిపర్‌పస్ వర్కర్లను నియమించిన ఆశించిన స్థాయిలో ప్రయోజనం కనిపించడం లేదు. అలాగే తడి, పొడి చెత్తను కూడా వేరు చేయకుండానే డంపింగ్‌యార్డులకు తరలిస్తున్నారు. సేకరించిన చెత్తతో సేంద్రీయ ఎరువులను తయారు చేసి దాని ద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవాల్సిన పంచాయతీలు ఆ దిశగా దృష్టి సారించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం ఎక్కడ చూసినా గ్రామ పరిసర ప్రాంతాలు చెత్తా చెదారంతోనే నిండి కనపిస్తున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో పల్లె పాలన గాడితప్పుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి.

### ● కాల్చి బూడిద చేస్తున్నారు..

గ్రామాల్లో అడపదడపగా సేకరిస్తున్న చెత్తను కాల్చేస్తూ బూడిద చేస్తున్నారు. చెత్తతో చాలా రకాల ఆదాయ మార్గాలు ఉన్నా అధికారులు పట్టించుకోవడమే లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. కొందరు అధికారులు చేతికి ఆదాయం వచ్చే పనుల పైననే దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని సందర్భాల్లో పంచాయతీ ట్రాక్టర్లను పక్క దారి పట్టిస్తూ సొంత పనులకు ఉపయోగిస్తూ చెత్తసేకరణ పనులను గాలికి వదిలేస్తున్నారు. సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేయకుండానే డంపింగ్ యార్డుకు తరలిస్తూ నిప్పుపెట్టి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల్లోని పంట పొలాలకు వెళ్లే రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చెత్తను కాల్చడంతో గ్రామాల పరిసర ప్రాంతాలు వాయు కాలుష్యంతో నిండిపోతోంది. అలాగే పంట పొలాల్లోకి చెత్త చేరి ఇబ్బందుల పాలవుతున్నామని రైతులు వాపోతున్నారు. జిల్లాలో నిబంధనల ప్రకారం చెత్త సేకరణ జరుగడం లేదని ఎన్నో ఫిర్యాదులు వస్తున్నా అధికారులు పట్టించుకోవడమే లేదంటున్నారు. లక్షల రూపాయలు ఖర్చుపెట్టి డంపింగ్‌యార్డులను నిర్మించిన అసలు ఫలితం లేకుండానే పోయింది. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారి పోతుందనే విమర్శలు వస్తున్నాయి.

### ● కొరవడుతున్న పర్యవేక్షణ

జిల్లాలో పారిశుధ్య నిర్వహణపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో స్థానికంగా కార్యదర్శులు ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఏదో అడపదడపగా పంచాయతీకి వెళ్లడం, పంచాయతీ కార్యాలయానికే పరిమితం కావడంతో పారిశుధ్యంపై పట్టింపు (...మిగతా 6వ పేజీలో)

### అంతా సర్వే పనుల్లోనే ఉన్నారు..



● శ్రీలత (డీపీఓ, ఆదిలాబాద్)

ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శులంతా కులగణన సర్వే పనుల్లోనే ఉన్నారు. దీంతో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ కొంత ఇబ్బందికరంగా మారింది. కొన్నిచోట్ల గ్రామ పంచాయతీ కార్యదర్శులు మెరుగుగానే పారిశుధ్య పనులను నిర్వహిస్తున్నారు. చెత్తసేకరణపై నిర్లక్ష్యం చేస్తే సహించేదిలేదు. పరిశీలించి తగుచర్యలు తీసుకుంటాం. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని సంబంధిత ఎంపీడీఓలను ఆదేశిస్తాం. పారిశుధ్య నిర్వహణలోనిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.


ఇచ్చోడలో నిరుపయోగంగా కనిపిస్తున్న డంపింగ్ యార్డు


భీంపూర్ మండలంలో నిరుపయోగంగా కనిపిస్తున్న డంపింగ్ యార్డు

## కొలం విద్యార్థులకు ఆధార్ కార్డుల అందజేత



గుంజలలో ఆధార్ నమోదు చేయిస్తున్న తహసీల్దార్ నలంద ప్రియ

భీంపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం గుంజల గ్రామానికి చెందిన ఆదివాసీ కొలం గిరిజన విద్యార్థులకు ఆధార్ కార్డులు లేక చదువులకు సంక్షేమ పథకాలకు అందడం లేదని ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆధార్ కార్డు లేక అవస్థలు అనే కథనం ప్రచురణ కావడంతో స్పందించిన జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించడంతో భీంపూర్ తహసీల్దార్ నలందా ప్రియ, పంచాయతీ కార్యదర్శి నైమతుల్లా ఖాన్, ఆధార్ ఏజెన్సీతో కలిసి గుంజల గ్రామానికి వెళ్లి ఆధార్ కార్డులేని విద్యార్థులందరికీ, గ్రామస్థులకు ఆధార్ కార్డులను అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నలంద ప్రియ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికి ఆధార్ కార్డు అందే విధంగా చర్యలు చేపడతామన్నారు. అంతేకాకుండా వారికి సంక్షేమం, అభివృద్ధి పథకాలు అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం గ్రామస్థులు, పలు సమస్యలు విన్నవించగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కాగా కొలం గిరిజనులకు ఆధార్ కార్డులు అందేవిధంగా కృషి చేసిన ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి గిరిజనులు అభినందనలు తెలిపారు.

## వృద్ధాశ్రమానికి ప్రతీనెలా రూ. 20 వేలు

● జిల్లా విద్యుత్ శాఖ అధికారి చౌహాన్

తలమడుగు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని సాయిలింగి వృద్ధాశ్రమానికి విద్యుత్ శాఖ సీఎండీ వరుణ్ రెడ్డి ప్రోత్సాహంతో విద్యుత్ శాఖ ద్వారా ప్రతీ నెలా 20 వేల రూపాయలు అందజేస్తామని జిల్లా విద్యుత్‌శాఖ అధికారి ఎస్సీ చౌహాన్ అన్నారు. శనివారం సాయిలింగి వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లా డుతూ తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ అధికారి సీఎండీ వరుణ్‌రెడ్డి ప్రోత్సా హంతో విద్యుత్ శాఖ ద్వారా సామాజిక దృక్పథంతో వృద్ధులకు సేవ చేయాలనే సంకల్పంతో విద్యా శాఖ ద్వారా వృద్దులకు ఆన్‌లైన్ ద్వారా రూ.20 వేలను అందిస్తున్నామన్నారు. అదే విధంగా వృద్ధుల కోసం వృద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు డెబ్బడి అశోక్ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. అనంతరం విద్యాశాఖ అధికారులు వృద్ధులతో కలిసి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు డెబ్బడి అశోక్, ఏఈ సతీష్, డి.హరికృష్ణ, ప్రభాకర్, దిగంబర్, సంజీవ్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.


వృద్ధాశ్రమానికి చెక్కును అందిస్తున్న అధికారి చౌహాన్

# తల్లిదండ్రులకు వరం.. కల్యాణలక్ష్మి

● ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉట్నూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) ఆడపిల్లల తల్లిదండ్రులకు ప్రభుత్వం అందించిన కల్యాణ లక్ష్మీ పథకం వరం లాంటిదని ఖానాపూర్ శాసనసభ్యులు వెడమ బొజ్జుపటేల్ అన్నారు. శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో 33 మందిలబ్దిదారులకు ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అమలు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ప్రారంభించిన సర్వేకు ప్రతీ ఒక్కరు సహకరించాలని సర్వేలో ఉన్నది ఉన్నట్లుగా చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అభిజ్ఞమాలవీయ, ఎంపీడీఓ రాంప్రసాద్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, నాయబ్ తహసీల్దార్ అమృతాల్, సింగిల్ విండో చైర్మన్ ఎస్సీరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖయ్యుం, నాయకులు దూట రాజేశ్వర్, సిద్దం రాజేశ్వర్, బిరుదుల లాజర్ పాల్గొన్నారు.


ఉట్నూర్‌లో కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

### కౌలు రైతులకు రైతు భరోసా కల్పించాలి

జిల్లాలోని కౌలు రైతులను గుర్తించి వారికి ప్రభుత్వం ద్వారా రైతు భరోసా నిధులిచ్చే విధంగా కృషి చేయాలని ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జుపటేల్‌ని కౌలు రైతులు, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపుబొర్రన్నలు కోరారు. శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి ఈ మేరకు వినతి పత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే బొజ్జుపటేల్ సాను కూలంగా స్పందించి అసెంబ్లీలో ఈవిషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని తెలిపినట్లు ఆయన తెలపారు. ఆయన వెంట రైతులు విషంరావు, చంద్రయ్య, సత్యనారాయణ, మారుతి ఉన్నారు.

### మహిళల అభివృద్ధికి పెద్దపీట..

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం సబ్బండ వర్గాల ప్రజల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తోందని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శనివారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 20 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

### పరామర్శ

ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెకంట రావు కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడు తున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు.

### గ్రామాల అభివృద్ధే ధ్యేయం

మారుమూల గ్రామీణ ప్రాంతాలను అన్ని విధాలుగా అభివృద్ధి పరచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఇంద్రవెల్లి మండలంలోని ధన్నోరా(బి) గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు.


సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో

## సర్వేలో తప్పులు లేకుండా చూడాలి

● ఎంపీడీవో గడ్డం మోహన్‌రెడ్డి

తాంసి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆరు రోజుల నుంచి తాంసి మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన కుటుంబ సర్వేను పకడ్బందీగా చేయాలని ఎంపీడీవో గడ్డం మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాలలో చేపడుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని కుటుంబాలను సర్వే చేసి అడిగి తెలుసుకున్నారు. సర్వే చేసేటప్పుడు ప్రజలు ఎలా సహకరిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, సర్వే సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఢిల్లీ వేదికగా దుబార్‌పేట్ కళాకారుల ప్రతిభ

● రాష్ట్రపతి ముందు నృత్యం చేయడం మా అదృష్టం: కాత్లె శ్రీధర్

ఇచ్చోడ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఢిల్లిలో నిర్వహించిన ఆదివాసీ గౌరవ దివాస్‌గా ప్రకటించిన క్రాంతికార్ భగవాన్ బిర్సాముండా జయంతి వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ముందు మండల కళాకారులు ప్రతిభ కనబర్చారు. ఇచ్చోడ మండలంలోని దుబార్‌పేట్ గ్రామానికి చెందిన ఆది వాసీ సకల కళా సంక్షేమ సంఘానికి చెందిన కళాకారులు దేశ రజాధాని ఢిల్లీలోని పార్లమెంట్ హౌజ్‌లో నిర్వహించిన భగవాన్ బీర్సమండా జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సకల కళా సంక్షేమ సంఘం డైరెక్టర్ కాత్లే శ్రీధర్ మాట్లాడుతూ.. మేము ప్రదర్శించిన కళ ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని, రాష్ట్రపతి ముందు నృత్యాలు చేసే అవకాశం కల్పించినందుకు మినిస్ట్రీ ఆఫ్ కల్చరల్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారులు ఆనంద్, చిట్టిబాబు, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముతో ఇచ్చోడ మండల కళాకారులు


జైనథ్ లక్ష్మీనారాయణ స్వామి ఆలయం



స్వామి విగ్రహం

## శేషవాహనంపై ఊరేగిన శ్రీమన్నారాయణుడు

● జైనథ్‌లో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

జైనథ్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాకేంద్రానికి 18 కిలో మీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రమైన జైనథ్ లక్ష్మీనారాయణ స్వామి అలయంలో ప్రతీ సంవత్సరం లాగే కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా శుక్రవారం రాత్రి స్వామివారి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని రంగు రంగుల పూలతో పాటు వివిధ విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వామి ఉత్సవ విగ్రహాన్ని అలయం చుట్టూ ఊరేగించారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాతో పాటు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అడ్డిరుకేష్‌రెడ్డి, ఆలయ ఈవో పి. వామన్‌రావ్, ప్రధాన అర్చకులు ధీరజ్, వెంకన్న, భక్తులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తూ గ్రూప్-4కు..


నితిన్‌రెడ్డి

బోథ్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పొచ్చెర గ్రామానికి చెందిన నల్ల నితిన్‌రెడ్డి కానిస్టేబుల్‌గా అగ్నిమాపక శాఖలో ఉద్యోగం చేస్తూనే గ్రూపులో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సంపాదించాడు. ఉద్యోగం చేస్తూ పోటీ పరీక్షల్లో మరో ఉద్యోగం సంపాదించడం పట్ల గ్రామస్థులు కుటుంబీకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒకే యువకుడు రెండు కొలువులు సంపాదించడం పట్ల ప్రతిభను అభినందిస్తున్నారు.

## మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పాయల శంకర్

ఆదిలాబాద్ అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బీజేపీ అభ్యర్థుల తరపున ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం వర్థ ఎమ్మెల్యే అభ్యర్థి పంకజ్ బోయర్ దంతోలి పట్టణంలో ప్రచారం నిర్వహించి బీజేపీని ఆదరించాలని కోరారు. అదేవిధంగా ఈ నెల 17న స్వాలంబి విద్యాలయ సబ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా బహిరంగ సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ మహారాష్ట్రలో మరో సారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం అన్నారు. ప్రజల నుంచి బీజేపీ కూటమికి విశేష స్పందన లభిస్తుందని పేర్కొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్